క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పాఠశాలలో మాక్‌డ్రిల్ చేస్తున్న ఫైర్ సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం నాలుగో రోజు పోడూరు మండలం జిన్నూరులోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. విద్యార్థులకు అగ్నిమాపక ప్రమాదాల నివారణపై జాగ్రత్తలను వివరించారు. పెద్ద పెద్ద భవనాలు, మాల్స్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ద్వారా ప్రమాదం సంభవిస్తే ఎలా నిర్మూలించాలి? ఎలా బయటపడాలో? డెమో ద్వారా వివరించారు. అంతే కాకుండా గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవిస్తే సీఓ2 తో, ఆయిల్స్ ఫైర్ అయినప్పుడు ఫోమ్ ఉపయోగించి ఏ విధంగా మంటలను అదుపులోకి తీసుకురావాలో? వివరించారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకిరామ్, ఎంఎస్ఎన్ మూర్తి, ఐ.మనోహర్ పాల్గొన్నారు.

శ్మశానవాటికల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



తహసీల్దారుకు వినతి పత్రం సమర్పిస్తున్న మాలమహానాడు నాయకులు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో దళితుల శ్మశానవాటికలు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆచంట తహసీల్దారు జి.కనకరాజుకు వినతి పత్రం సమర్పించారు. దళితుల శ్మశానవాటికలో రోడ్లు, మంచినీరు, షెడ్లు, జంగిల్ క్లీనింగ్, ప్రహరీ, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేయాలన్నారు. శ్మశానవాటికలు లేని చోట శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా దళిత వాడలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, కుసుమే వెంకటేశ్వరరావు, గోసంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు నిలపాలి



తణుకులో రక్తదానం చేస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ మూర్తి

పెనుగొండ: ప్రతి ఒక్కరూ రక్త దానం చేసి, ఆపదలో ఉన్న క్షతగాత్రులను ఆదుకొని వారి ప్రాణాలు నిలపాలని పెనుగొండ ఎంపీడీఓ టి.సూర్యనారాయణ మూర్తి అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో తణుకులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పెనుగొండకు చెందిన పలువురు పంచాయతీరాజ్ శాఖాధికారులు రక్తదానం చేశారు. రక్త దానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలు నిలపడంతో పాటు, దాతలకు ఆరోగ్యం కలుగుతుందన్నారు.

దేవదాయ ఉద్యోగులకు పీఆర్‌సీ అమలు చేయాలి



మాట్లాడుతున్న విత్తనాల శ్రీనివాస్

పెనుగొండ: ఆలయాల్లో పని చేస్తున్న దేవదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగులకు 2022 పీఆర్‌సీని అమలు చేయాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విత్తనాల శ్రీనివాస్ కోరారు. గురువారం పెనుగొండ వాసవీ నివాస్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సమూహ గ్రూపు దేవాలయాల్లో ఉద్యోగుల సర్దుబాటు చేస్తూ పీఆర్‌సీని అమలు చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యూటీ రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్షుడు నల్లం రామకృష్ణ, కార్యదర్శి యిప్పల శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర అధ్యక్షుడు సీహెచ్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

రేపు రన్ ఫర్ జీసస్ 10కే రన్

నరసాపురం: రన్ ఫర్ జీసస్ పేరుతో శనివారం పట్టణంలో 10కే రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆరాధన టీవీ, రన్‌ఫర్ జీసస్ కో–ఆర్డినేటర్ టి.సంజయ్‌కిషన్ తెలిపారు. ఈ మేరకు గురువారం 10కే రన్ టీషర్టులు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజయ్‌కిషన్ మాట్లాడుతూ 10కే రన్ ఉదయం 6 గంటలకు థామస్ బ్రిడ్జి వద్ద నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ వై.రూబెన్, కాకిలేటి డానియల్‌రాజు, ఎండీ పాల్ రాజు, గుమ్మాపు శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో మెరుగైన ఆరోగ్యం

- ఆరోగ్యంపై ప్రజల్లో పెరుగుతున్న శ్రద్ధ
- ఎంత పని ఉన్నా వ్యాయామానికి సమయం కేటాయిస్తున్న వైనం
- నడకకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రజలు



మెడికల్ క్యాంపులో ఉచితంగా మందులు అందజేస్తున్న వాకర్స్ సభ్యులు (ఫైల్)



కుళాయి చెరువు గట్టుపై వాకింగ్ చేస్తున్న ప్రజలు

పాలకొల్లు సెంట్రల్: ప్రస్తుత యాంత్రిక జీవనంలో జనం కాలంతో పాటు పరుగులు పెడుతున్నారు. ఉదయం నిద్ర లేచింది మొదలు సాయంత్రం ఇంటికి చేరే వరకూ ఉరుకులు పరుగులే. గతంలో ఈ పరిస్థితి పట్టణవాసుల్లో ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతప్రజలు కూడా బిజీబిజీ జీవితాన్ని గడుపుతున్నారు. నిత్యం పని ఒత్తిడిలతో ప్రజలు సతమతమవుతున్నారు. తద్వారా అనేక అనారోగ్యాలకు గురవుతున్నారు. కోవిడ్ మహమ్మారి వచ్చిన తరువాత ప్రజలు ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపుతున్నారు. అనారోగ్య సమస్యలను తగ్గించుకోవడానికి మంచి మార్గాలను ఎంచుకుంటున్నారు. అందులో రోజూ క్రమం తప్పకుండా కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయిస్తున్నారు. అలాగే ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. అన్నింటికన్నా మెరుగైన మార్గం నడక అని రోజు తప్పనిసరిగా 30 నిమిషాల నుంచి గంట సమయం పాటు వాకింగ్ చేస్తే చాలా అనారోగ్య సమస్యలను తగ్గించుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. దానితో చిన్న పెద్ద తేడాలేకుండా అందరూ నడకను ప్రధాన పరిష్కార మార్గంగా ఎంపిక చేసుకుంటున్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిస్తూనే..

ఉదయాన్నే వేడినీళ్లు తాగడం, సూర్యనమస్కారాలు, యోగా వంటి ఆరోగ్య సూత్రాలు నిత్యకృత్యంగా పాటిస్తున్నారు. మనిషి ఆరోగ్యంగా లేకపోతే ఎంత సంపాదించుకుంటే మాత్రం ఉపయోగం ఏముంటుంది? అనే ధోరణిలో ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. పట్టణంలో కుళాయి చెరువుగట్టు, బ్రాడీపేట బైపాస్ రోడ్డు, ఆర్ఆర్ఆర్ రైస్ మిల్లు గ్రౌండ్, ఏపిజె అబ్దుల్ కలాం పార్క్, మెయిన్ రోడ్డు, రైల్వే ట్రాక్ రోడ్డు, పూలపల్లి బైపాస్ రోడ్డు, ఇంకా అనేక లే అవుట్లలో ఉన్న రోడ్లను వాకింగ్ ట్రాక్‌లుగా ఎంచుకుంటున్నారు. గ్రామాల్లో అయితే హైస్కూల్ గ్రౌండ్ లేదా పొలం గట్లు, గ్రామాల్లో ఉన్న రోడ్లపైనే చేస్తున్నారు. కొంతమంది ఉదయాన్నే ప్రధాన రహదారులపై వాకింగ్ చేస్తున్నారు. ఇవి ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం పాలకొల్లులో ఓ హోటల్ యజమాని ఉదయాన్నే మెయిన్ రోడ్డులో వాకింగ్ చేస్తూ బస్టాండ్ సెంటర్ నుండి వస్తుండగా ఆటో వచ్చి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదాల నేపథ్యంలో చాలా మంది కుళాయి చెరువు గట్టు లేదంటే లేఅవుట్లలో వాకింగ్ చేయడానికి ఎంచుకుంటున్నారు.

నడకతో ప్రయోజనాలెన్నో

భోజనానికి ముందు ఉదయం, సాయంత్రం వేళల్లో నడిస్తే ప్రమాదకరమైన కొవ్వు తగ్గించుకోవచ్చు. నడకతో గుండెను పరిరక్షించే శక్తి పెరిగి, తక్కువ స్పందనలతో ఎక్కువ రక్తం సరఫరా అవుతుంది. గుండెపోటును తట్టుకునే సమర్థత నడక వల్ల లభిస్తుంది. కండరాలు ఆక్సిజన్‌ను సమర్థంగా ఉపయోగించుకుంటాయి. శరీరంలో ఇన్సులిన్ శాతాన్ని పెంచేందుకు ఎక్కువగా తోడ్పడుతుంది. సుగర్ వ్యాధి దరిచేరకుండా కాపాడుతుంది. మానసిక ఒత్తిడి, వెన్నునొప్పి, స్థూలకాయం వంటి సమస్యలను నివారిస్తుంది. నిద్రలేమితో బాధపడే వారికి నడక ఒక దివ్యౌషధం. ఊబకాయంతో బాధపడేవారు క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల శరీర బరువు అదుపులో ఉంటుంది.

నడకే దివ్యౌషధం



నయాపైసా ఖర్చులేని దివ్యౌషధం నడక అనే నినాదంతో వాకర్స్ క్లబ్ పనిచేస్తుంది. నడక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమని వాకర్స్ క్లబ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుంటాం. క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటాం. క్లబ్‌లో చేరాలంటే సభ్యత్వం ఒక్కటే సరిపోదు తప్పనిసరిగా వాకింగ్‌కు రావాల్సిందేనని నిబంధనలు పెట్టి వారితో వాకింగ్ చేయిస్తూ క్లబ్ సభ్యులను పెంచుతున్నాం. గత పదేళ్లుగా క్లబ్ ద్వారా ఎంతోమందితో వాకింగ్ చేయిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నాము.

– తటవర్తి సుధాకరరావు, మెడికల్ ఏజెన్సీ, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్, పాలకొల్లు

13 ఏళ్లుగా వాకింగ్



నేనుగత 13 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నాను. పదేళ్ల క్రితం వాకర్స క్లబ్‌ను ఏర్పాటుచేశారు. వాకింగ్‌పై అనేక అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. వాకింగ్‌కి వచ్చే వాకర్స్ కోసం క్లబ్ తరుపున మెడికల్ క్యాంపులు ఏర్పాటుచేసి సుగర్, బీపి, ఎముకల సాంద్రత వంటి పరీక్షలు నిర్వహిస్తుంటాం. అవసరమైన వారికి మందులు ఉచితంగానే అందజేస్తాం. ఇటీవల వాకింగ్ చేసే జనాబా సంఖ్య బాగా పెరిగింది.

– మానెం బసవరాజు, ఉపాధ్యక్షులు వాకర్స్ క్లబ్ సెక్రటరీ, పాలకొల్లు

ప్రభుత్వ వైఫల్యాలను గ్రామాల్లో ఎండగట్టాలి



ఎస్.ఇల్లిందలపర్రులో వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంత్ర: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామీణ ప్రాంత ప్రజలకు వివరించాలని ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు అన్నారు. మండలంలోని సోమరాజు ఇల్లిందలపర్రు వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి సూర్యభాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, చెరుకువాడ నరేష్‌రాజు నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతంచేయడానికి కార్యకర్తలు అంతా కృషి చేయాలన్నారు. ఎన్నికలలో అమలు చేయలేని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను అరాచకాలను ఎండగట్టేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సెల్ అధ్యక్షుడు దొంగ దుర్గాప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి కిరణ్, సర్పంచ్ వనుం సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ గంటా శ్రీను, ఉపసర్పంచ్ గొలుగూరి నాగిరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు కర్రిశంకర్ శ్రీరామారెడ్డి, దిద్దే మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ సీహెచ్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఆయుష్మాన్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

పెనుమంత్ర: గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్ కేంద్రాల్లో గత రెండేళ్లుగా హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తున్న మెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం పెనుమంత్ర మండల పరిధిలో ఎంఎల్‌హెచ్‌పీలు పెనుమంత్ర పీహెచ్‌సీ వద్ద ధర్నా నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ జిల్లా ఉద్యోగుల సంఘం కోశాధికారి జి.సత్య స్వరూప్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. గత రెండేళ్లుగా జీతాలు విషయంలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఉద్యోగుల భద్రత కల్పించాలని ఎన్‌హెచ్ఎం జాతీయ ఆరోగ్య ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను పునరుద్ధరించాలని క్లినిక్‌లకు సంబంధించి అన్ని బకాయిలను క్రమబద్ధీకరించాలని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఎంఎల్‌హెచ్‌పీలు ముఖేష్, శ్రీనివాస్, రేవతి, ఇందిర, ఉదయ్, స్వాతి, కుమారి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: వాతావరణ శాఖ అధికారుల సూచన మేరకు రాబోయే రోజుల్లో వాతావరణంలో మార్పుల దృష్ట్యా వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తహశీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులందరూ తమ పంటలను ఒబ్బిడి చేసుకునేందుకు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పొలాల నుంచి తమ పంటలను గట్టుకు చేర్చుకుని ఒబ్బిడి చేసుకోవాలన్నారు. టార్పాలిన్, ప్లాస్టిక్ షీట్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా ధాన్యాన్ని మిల్లులకు తరలించుకోవాలని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనుమంత్ర: స్థానిక కొండలమ్మ గుడి వద్ద స్టేట్ హైవే రోడ్డుపై గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం పెనుమంత్రకు చెందిన సత్తి పద్మావతి అనే మహిళ భీమవరం మండలం తాడేరుకు చెందిన డ్రైవర్ రామారావు చెందిన ఆటోలో మార్టేరు వైపు వెళ్తుండగా ఓ కారు వీరి ఆటోను ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కార్ బెలూన్లు ఓపెన్ కావడంతో అందులోని ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారు. గాయపడిన పద్మావతి, రామారావులను 108లో పాలకొల్లులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ కార్గో పాయింట్ ప్రారంభం

తణుకు అర్బన్: ఆర్టీసీ కార్గో సేవలను ప్రయాణికులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అన్నారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో గురువారం పవన్ సెల్ పాయింట్ వారికి ఆర్టీసీ కార్గో పార్సిల్స్, కొరియర్స్ బుకింగ్, టికెట్ రిజర్వేషన్ సదుపాయాన్ని ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంత సురక్షితమో ఆర్టీసీ కార్గో కూడా అంతే సురక్షితంగా పార్సిల్స్‌ను గమ్యానికి చేరుస్తాయని స్పష్టం చేశారు. హైదరాబాద్, తిరుపతి వెళ్లే ప్రయాణికులు తణుకు రాకుండా దువ్వ లోనే బస్సు ఎక్కే ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తణుకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్, దువ్వ ఏజెంట్ కేశవరపు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 55 మంది ఎంపిక



క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన అభ్యర్థులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏపి శిక్షణ ఉద్యోగ కల్పన సంస్థ వికాస సౌజన్యంతో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికలో 55 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన ఇంటర్వ్యూల్లో తణుకు, భీమవరం, అత్తిలి, రాజోలు, మల్కిపురం, నరసాపురం తదితర ప్రాంతాల నుంచి 148 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. వీరిలో పానాసోనిక్ 6, ఇండో ఎంఐఎంకు 2, హుండాయ్ 2, స్కై క్వాడ్ 18, కాగ్నెంట్ 9, ఐఫోన్–12, హెచ్‌డీబీకు 6 గురు మొత్తం 55 మంది అభ్యర్థులు ఎంపికవ్వగా వారిలో 15 మంది చాంబర్ విద్యార్థులు ఉన్నారన్నారు. కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు, ట్రెజరర్ సీతారామరాజు, కాకినాడ కలెక్టరేట్ అసిస్టెంట్ మేనేజర్ వికాస ఎస్.పవన్ కుమార్, వి.రాజా రమేష్, వర్మ, తేజ తదితరులు పాల్గొన్నారు.

సీవీవీఎస్‌కు సత్కారం



సీవీవీఎస్‌ను సన్మానిస్తున్న సాహిత్య కళాకారులు

పాలకొల్లు సెంట్రల్: పద్య, సాహిత్య, కళా రంగాల్లో చేగొండి వీవీ సత్యనారాయణ మూర్తి ప్రతిభ అత్యంత అద్భుతమని భువన విజయం లాంటి పౌరాణిక పద్య రూపకంలో భట్టు మూర్తి పాత్ర సీవీవీకే సాధ్యమని గురుసహస్రవధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ అన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకున్న సీవీవీఎస్ దంపతులను బుధవారం రాత్రి స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఘనంగా సత్కరించారు. ముందుగా దంపూరి దుర్గాప్రసాద్ దుర్యోధన ఏకపాత్రాభినయం, పోకల జ్యోతి భరత్ శిష్య బృందంతో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ త్సవటపల్లి సత్యనారాయణమూర్తి, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు, జీవీకే రామారావు, వంగా నరసింహరావు, కొట్టి భాస్కరరావు, కేవీ కృష్ణవర్మ, కారుమూరి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథ ప్రచారం

పాలకొల్లు సెంట్రల్: శ్రీ విశ్వావసు నామ సంవత్సరం శ్రీరామనవమి సందర్భంగా భగవద్గీత, 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేసినట్లు భీమవరం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు ఉదయ్ కుమార్ తెలిపారు. గురువారం పాలకొల్లు మండలంలోని పాలమూరు గ్రామంలో త్రైత సిద్ధాంత గ్రంథ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఉదయ్ కుమార్ మాట్లాడుతూ శ్రీరామ అంటే శ్రీ అంటే మోక్షం, రా అంటే జన్మ లేకుండా నశించడం, మ అంటే జీవుడు అని కాబట్టి శ్రీరామ అంటే జీవుడు జన్మలు లేనివాడై దేవునిలోకి ఐక్యం కావడమని అర్థమని వివరించారు. ఈ ప్రచారంలో సభ్యులు వాసుదేవ, నాగేశ్వరరావు, రాజు, లోకేష్, మూర్తి, ప్రభాకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



యలమంచిలి: కలగంపూడి సబ్ సెంటర్‌లో పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఎస్ సతీష్



పెనుమంత్ర: పీహెచ్‌సీ వద్ద అంగన్‌వాడీ పిల్లలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కనకప్రియ

యలమంచిలి: తల్లులంతా పిల్లల ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని యలమంచిలి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.సతీష్ కోరారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం కలగంపూడి, కాజ తూర్పు, కాజ పడమర గ్రామాల్లో సబ్ సెంటర్లలో పిల్లల బరువులు తూచారు. అనంతరం పిల్లలకు డాక్టర్ ఎస్.సతీష్ ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన బలహీనంగా ఉన్న పిల్లలకు ఐరన్ సిరప్ పట్టించాలని, ఆరు నెలలకు ఒకసారి నులి పురుగులు మాత్రలు మింగించాలని తల్లులకి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా, సీహెచ్ఓ సత్యవతి, ఏఎన్ఎం వి.కృపావతి, ఎంఎల్‌హెచ్‌పీ వి.సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు

పెనుమంత్రలో..

పెనుమంత్ర: మండలంలో మూడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు చెందిన అంగన్‌వాడీల పిల్లలకు ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో గురవాఉరం వైద్య పరీక్షలు నిర్వహించారు. పెనుమంత్రలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.కనకప్రియ, మార్టేరులో డాక్టర్ బి.మల్లిక, ఆలమూరులో డాక్టర్ యు.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలల్లోని పోషణ లోపం ఉన్న పరీక్షలను నిర్వహించి తల్లులకు తగిన సూచనలు అందించారు.

గ్రంథాలయ వ్యవస్థను ఉత్తేజపర్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

నరసాపురం రూరల్: రోజురోజుకూ బలహీన పడుతున్న గ్రంథాలయ వ్యవస్థను ఉత్తేజపరచడం కోసం అందరినీ గ్రంథా లయ పునర్వికాస ఉద్యమం వైపు నడిపేందుకు ఊరూరా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం రాత్రి నరసాపురం అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో అరసం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కొప్పర్తి రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమానికి గోదావరి జిల్లాలు ఊపిరి పోశాయని అన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ వందేళ్ల నాటి గ్రంథాలయ ఉద్యమ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కెజెఎస్ కుమారి, రెడ్డప్ప ధవేజి, బాపూశ్రీ, సుధీర్‌మోహన్, నెక్కంటి సుబ్బారావు, గోపాలకృష్ణ గోఖలే, చినిమిల్లి వీరబాబు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన



పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న రామారావు

నరసాపురం: పిల్లలు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది పప్పుల రామారావు సూచించారు. రామారావు కుమారుడు భాస్కరశ్రీకృష్ణ నరేష్ 15వ వర్ధంతిని సందర్భంగా ఆయన పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బొండమ వృద్ధాశ్రమం, రుస్తుంబాధ లెప్రసీ కాలనీలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ తన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తర్వాత ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు చేయడంతో పాటుగా, హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.